News Daily

ఎడిటర్ : B. ఉపేందర్

cknews7484@gmail.com

Visit in : www.cknewstv.in

# CK చంద్రకాంత్ NEWS

తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :184 | ఖమ్మం | సోమవారం, ఆగస్టు 10, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad




- 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చిన మోదీ
- ఆగస్ట్ 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు
- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మరింత ప్రత్యేకం

# దేశవ్యాప్తంగా విస్తృతంగా తిరంగా యాత్రలు



## పెద్ది లేడని బాధపడొద్దు..
# పెద్దన్నగా నేనున్నా



- నల్లబెల్లిలో సుదర్శన్‌రెడ్డి దశదిన కర్మకు హాజరైన కేసీఆర్
- ఆత్మీయుడి కుటుంబాన్ని ఓదార్చుతూ భావోద్వేగానికి గురైన మాజీ సీఎం
- 'పెద్ది భౌతికంగా మన మధ్య లేకపోయినా ఎలాంటి ఆందోళన చెందొద్దు.. ధైర్యం కోల్పోవద్దు
- కుటుంబానికి పెద్దదిక్కుగా నేనున్నా. పార్టీ అండగా ఉంటుంది

వరంగల్

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి లేరన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మీయుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి వరంగల్ జిల్లా నల్లబెల్లికి మధ్యాహ్నం 3.50 గంటలకు వచ్చారు. తొలుత పెద్ది చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం పెద్ది భార్య స్వప్న, పిల్లలు, తల్లి అమృతమ్మ, అన్నదమ్ములు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. పిల్లలను అక్కున చేర్చుకుని కాసేపు వివరాలు 2లో..



## యువతకు ఐవైసి ఎప్పుడూ తోడుంటుంది

- 'ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు
- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని తప్పుపట్టిన రాహుల్
- విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమంలో ఓ విద్యార్థి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

# నేడే ఆఖరు

## ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు సమర్పించడానికి గడువు నేటితోనే ముగియనుంది

- రాత్రి 12 గంటల వరకు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకోవాలని బీఎల్ఓలకు ఆదేశం
- ఫారం ఇవ్వకుంటే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు తొలగింపు
- భవిష్యత్తులో పౌరులకు కీలకంగా మారనున్న సర్--2026 జాబితా
- తుది జాబితాలో పేరు లేకుంటే భవిష్యత్తులో చిక్కులు
- మళ్లీ కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలంటే తిప్పలు



హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)-2026 కార్యక్రమంలో భాగంగా మీ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించి మీ ప్రాంత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కి ఇంకా సమర్పించలేదా? అయితే త్వరపడండి. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు సమర్పించడానికి గడువు నేటితోనే ముగియనుంది. ఫారం ఇవ్వకుంటే ఈ నెల 17న ప్రచురించనున్న సర్ ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరును తొలగించనున్నారు. ఒకవేళ ముసాయిదా జాబితాలో పేరు తొలగిస్తే మళ్లీ కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం--6 దరఖాస్తు చేసుకోక తప్పదు. దీనికితోడు సర్--2002 ఓటర్ల జాబితాలో ఉన్న మీ ఓటు లేదా మీ బంధువుల ఓట్ల వివరాలను స్వీయధ్రువీకరణ ఫారంలో నింపి ఇవ్వాల్సి ఉంటుంది. సర్ షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తుతోపాటు వివరాలు 2లో..

## బోనమెత్తిన
# పాతబస్తీ



- కన్నుల పండువగా లాల్‌దర్వాజా బోనాలు
- మొదటి బోనం సమర్పించిన దేవేందర్ గౌడ్ కుటుంబం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్,పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్
- బంగారు బోనమెత్తిన కొండా సురేఖ.. అలరించిన పోతరాజులు

చాంద్రాయణగుట్ట

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం కనుల పండువగా కొనసాగాయి. మహిళా భక్తులు సంప్రదాయ ప్రస్తధారణతో బోనాలను తీసుకురాగా....యువకులు పోతరాజు వేషధారణలో భక్తులను విశేషంగా అలరించారు. శివసత్తుల చిందులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జోగినీలు మెట్ల బోనాలతో నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కదువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ మంత్రి టి.దేవేందర్ గౌడ్ వివరాలు 2లో..

## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

- క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని
- ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- 'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా
- ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



- పాకిస్థాన్ పాలకులపై స్థానికుల ఆగ్రహం
- ఉగ్రమూకల మనుగడ ఇక కష్టమేనా!
- పీఓకేలో ఇస్లామాబాద్ పాలకుల ఏకపక్ష విధానాలు
- స్థానిక ఆకాంక్షల అణచివేత, జమ్మూకశ్మీర్ వలసదారుల రాజకీయ ఆధిపత్యంపై దశాబ్దాలుగా గూడుకట్టుకున్న అసంతృప్తి
- ప్రస్తుతం హింసాత్మక నిరసనలు, తిరుగుబాటు

## పీఓకేలో మారుతున్న
# సమీకరణాలు



# రాత పరీక్షకు పక్కా వ్యూహం




తెలంగాణ పోలీస్ నియామక మండలి పోలీస్, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి వేర్వేరుగా 4 నోటిఫికేషన్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో వేలాది మంది యువత ప్రస్తుతం రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఖాకీ యూనిఫామ్ ధరించాలంటే కేవలం చదువుపైనే కాకుండా శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణపై కూడా దృష్టి పెట్టాలి. లక్ష్యంపై గురి, నిరంతర శ్రమ అనే సూత్రాన్ని పాటిస్తూ ముందుకు సాగితే పోలీస్ ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదని నిపుణులు సూచిస్తున్నారు. సమయాన్ని వృథా చేయకుండా ఇప్పటి నుంచే సన్నద్ధతను ముమ్మరం చేయాలని చెబుతున్నారు.

పోలీస్ ఉద్యోగాల రాత పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులు ముందుగా అధికారిక సిలబస్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ స్టడీస్, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ తదితర అంశాలకు ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకుని క్రమపద్ధతిలో చదవాలి. ఒకేసారి ఎక్కువ పుస్తకాలు చదవడం కంటే, పరిమితమైన మంచి పుస్తకాలను పలుమార్లు చదవడం ప్రయోజనకరంగా ఉంటుంది.

కరెంట్ అఫైర్స్ కీలకం : పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే ప్రతిరోజూ నాణ్యమైన వార్తా పత్రికలను చదవడంతో పాటు ముఖ్యమైన అంశాలను నోట్స్ రూపంలో రాసుకోవాలి. గత ఆరు నుంచి ఎనిమిది నెలల జాతీయ, అంతర్జాతీయ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ పరిణామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వారానికి కనీసం ఒక మాక్ టెస్ట్ రాయడం, గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షలో సమయ పాలన, కచ్చితత్వం పెరుగుతాయి.

ఫిజికల్ టెస్టే కీలక మలుపు : పోలీసు ఎంపిక ప్రక్రియలో శారీరక సామర్థ్య పరీక్షలు అత్యంత కీలకం. రాత పరీక్షకు సిద్ధమవుతున్నప్పుడే ఫిజికల్ ఈవెంట్లపై కూడా సమానంగా దృష్టి పెట్టాలి. ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం కనీసం ఒకటి నుంచి రెండు గంటల పాటు రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లను సాధన చేయాలి. ప్రారంభంలో శరీర సామర్థ్యానికి అనుగుణంగా వ్యాయామం చేస్తూ క్రమంగా వేగం, దూరం, సామర్థ్యాన్ని పెంచుకోవాలి.

ఆహారం, నిద్ర, క్రమశిక్షణ : శారీరక శిక్షణతో పాటు సరైన ఆహారం తీసుకోవడం కూడా అవసరం. శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, పండ్లు, పాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పోషకాహారాన్ని తీసుకోవాలి. తగినంత నీరు తాగడంతో పాటు ప్రతిరోజూ సరిపడా నిద్రపోవాలి. విశ్రాంతి లేకుండా అతిగా వ్యాయామం చేయడం వల్ల గాయాల బారిన పడే అవకాశం ఉంటుంది. కాబట్టి శిక్షణ, ఆహారం, విశ్రాంతి మధ్య సమతుల్యత పాటించాలి.

"రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో మెరుగైన ప్రతిభ సాధించాలంటే రోజువారీ సాధనే ప్రధాన మార్గం. మైదానంలో నిర్ణీత సమయాన్ని కేటాయించి నిరంతరం ప్రాక్టీస్ చేయాలి. అవసరమైతే నిపుణులు, శిక్షకుల సలహాలు తీసుకోవాలి. కొందరు వ్యక్తులు, పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలి" – స్వప్న, పీఈటీ

లక్ష్యం ఒక్కటే : పోలీసు ఉద్యోగం సాధించాలనే కలను నిజం చేసుకోవాలంటే చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి. రోజువారీ చదువు, మాక్ టెస్టులు, గ్రౌండ్ ప్రాక్టీస్, సరైన ఆహారం, తగిన విశ్రాంతిని అలవాటుగా మార్చుకోవాలి. క్రమశిక్షణతో నిరంతరం శ్రమిస్తే ఖాకీ యూనిఫామ్ ధరించాలనే కలను సాకారం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ వార్



హైదరాబాద్ : రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు

కారణమని ఆయన స్పష్టం చేశారు. అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది. మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# 100 ఎకరాల్లో బస్ డిపో



హైదరాబాద్ : హైదరాబాద్‌లో ట్రాఫిక్ పెరుగుతోంది.. ఎక్కడికక్కడే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసినా సరే ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలుతో పాటుగా ఆర్టీసీ ప్రజా రవాణా అందుబాటులో ఉన్నా సరే ట్రాఫిక్ కష్టాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ నగరంలో వాహనాలకు తోడు తెలంగాణలోని ఇతర జిల్లాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆర్టీసీ బస్సులు నగరానికి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల కోసంఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లు ఉన్నాయి.. అయినా సరే ఒత్తిడి ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.. టీజీఎస్‌ఆర్టీసీ 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ టెర్మినల్‌ను ప్లాన్ చేసింది. తాజాగా ఈ

డిపోకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ జగద్గిరిగుట్ట దగ్గర బస్ డిపో నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం దగ్గర 100 ఎకరాలు కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజూ 404 ట్రిప్పుల వరకు తిరుగుతాయన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్ డిపో, టెర్మినల్ నిర్మాణం కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని గుర్తించిందన్నారు. కానీ హెచ్‌ఎంటీ అధికారులు.. అంత సుదీర్ఘకాలం స్థలాన్ని లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. దీని

కోసం ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పగా.. ఆ ప్రతిపాదనకు టీజీఎస్‌ఆర్టీసీ అంగీకరించలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీకి గాజులరామారం దగ్గర హెచ్‌ఎంటీ భూములకు సమీపంలో 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. గాజుల రామారంలో ఏర్పాటు చేయబోయే డిపోలో ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్, ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సు కారణంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు ఈ డిపోకు వెళ్లనున్నాయి. అప్పుడు ఎలాంటి సమస్య ఉండదని భావిస్తున్నారు

## నేడే ఆఖరు

-మొదటిపేజీ తరువాయి

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ వ్యవధిలో ఫారం--6 దరఖాస్తు చేసుకున్న వారికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) నోటీసులు జారీ చేసి విచారణకు పిలుస్తారు. విచారణకు హాజరై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నిర్దేశించిన 12 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని పుట్టిన తేదీ, నివాస చిరునామాగా చూపించాల్సి ఉంటుంది. ఇన్ని ఇబ్బందులను తప్పించుకోవాలంటే నేడు (సోమవారం) మీ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించి మీ ప్రాంత బీఎల్‌ఓకు అప్పగించాలి. భవిష్యత్తులో సర్--2026 ఓటర్ల జాబితా పౌరులకు కీలక ఆధారంగా మారనుంది. అక్టోబర్ 19న ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో పేరు రాకుంటే భవిష్యత్తులో చిక్కులు ఎదురయ్యే అవకాశ ఉంది.

### ఆదివారం 19వేల ఫారాలే దరఖాస్తు

రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుండగా, ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,64,30,494 మంది (78.14 శాతం) ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించారు. ఆదివారం 19,376 మంది మాత్రమే ఫారాలు సమర్పించారు. చివరి రోజు సోమవారం రాత్రి 12 గంటల వరకు ఫారాలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు ఆదేశించినట్లు జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత ఫారాలు సమర్పించడానికి గడువు ముగియనుంది. ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకున్న వారిలో ఇంకా 4,88,532 మంది ఓటర్లు వాటిని పూరించి బీఎల్‌ఓలకు సమర్పించాల్సి ఉంది. ఫారాలు తీసుకోని వారిని సైతం పరిగణలోకి తీసుకుంటే మొత్తం 73,95,954 మంది (21.86 శాతం) ఓటర్లు ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు.

### వరుస సెలవులతో ఇబ్బందులు

రెండో శనివారం, ఆదివారం, సోమవారం (బోనాలు) వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో కొన్ని ప్రాంతాల్లో బీఎల్‌ఓలు తమ విధులకు డుమ్మాకొట్టారని రాజకీయ పార్టీల నేతలు ఆరోపించారు. బోనాలు, రంగం సందర్భంగా 9, 10వ తేదీల్లో ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకోబోమని బీఎల్‌ఓలు చెప్పినట్టు తమకు అనేక ఫిర్యాదులు అందాయని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. 'సర్' షెడ్యూల్ ప్రకారం 10వ తేదీ వరకు ఫారాలు స్వీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

## పెద్ది లేడని బాధపడొద్దు.. పెద్దన్నగా నేనున్నా

-మొదటిపేజీ తరువాయి

దుఃఖించారు. విషణ్ణ వదనంతో మౌనంగా ఉండిపోయారు. పెద్ది కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ 'పెద్ది భౌతికంగా మన మధ్య లేకపోయినా ఎలాంటి ఆందోళన చెందొద్దు. ధైర్యం కోల్పోవద్దు. కుటుంబానికి పెద్దదిక్కుగా నేనున్నా. పార్టీ అండగా ఉంటుంది'అని కేసీఆర్ భరోసా ఇచ్చారు. తల్లి అమృతమ్మ, భార్య స్వప్నకు ధైర్యం చెప్పిన ఆయన... పిల్లలు బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు.

### ఉద్యమ సహచరుడిని తలచుకొని..

తెలంగాణ ఉద్యమం..బీఆర్ఎస్ పార్టీ నిర్మాణంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి పోషించిన కీలక పాత్రను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి వరంగల్ జిల్లాలో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పెద్ది చేసిన కృషిని, తనతో ఆయనకున్న సుదీర్ఘ ఆత్మీయ అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో, కల్మషం లేని హృదయంతో అందరితో కలిసిపోయే పెద్ది ఇక లేరనే బాధతో కేసీఆర్ కొద్దిసేపు మాటలు రాక మౌనంగా ఉండిపోయారు. పరిస్థితిని గమనించిన పార్టీ ముఖ్య నేతలు ఆయన్ను అనునయించడంతో కొంత తేరుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి కుమారుడు నిదర్శన్‌రెడ్డి, కుమార్తె ధరి?మష్ఠకు రూ.కోటి చొప్పున రూ.2 కోట్ల చెక్కులు, పెద్ది తల్లి అమృతమ్మకు రూ.25 లక్షల చెక్కును అందించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు.

## బోనమెత్తిన పాతబస్తీ

-మొదటిపేజీ తరువాయి

తనయుడు వీరేందర్ గౌడ్ దంపతులు అమ్మవారికి దేవి మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ సాయంత్రం వరకు కొనసాగింది. బోనాలతో పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు పట్టు వస్త్రాలు సమర్పించగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్, పైడి రాకేష్ రెడ్డి, రాజ్ ఠాకూర్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, బేబి సినిమా ఫేం వైష్ణవి చైతన్య, దర్శకుడు వంగ సందీప్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయ లక్ష్మీ, బీసీ కమిషన్ సలహాదారుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్, నగర పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు



హైదరాబాద్ : తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం. తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంఐఎం పార్టీ 2024-25 సంవత్సరానికి గాను రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న విరాళాలను సున్నాగా ప్రకటించింది. కాగా.. 2023-24లో ఈ పార్టీ 16 విరాళాల ద్వారా రూ. 9 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. నేషనల్ లెవల్‌లో గత ఏడాది నిధులు ప్రకటించి.. ఈ ఏడాది రూ.20 వేలకు పైబడిన విరాళాలు సున్నాగా చూపిన 3 పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా నిలిచింది. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువును పాటించడంలోనూ తెలంగాణ పార్టీలు విఫలం అయ్యాయి. 2023-24లో సరైన సమయానికే విరాళాల వివరాలను ఈసీకి సమర్పించిన బీఆర్ఎస్, ఎంఐఎం.. 2024-25కి సంబంధించి మాత్రం గడువు దాటిన తర్వాతే నివేదికలు ఇచ్చాయి. బీఆర్ఎస్ నిర్ణీత గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా రిపోర్ట్ చేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంగా తన నివేదికను సమర్పించినట్లు ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

# నాచారంలో తప్పిన పెను ప్రమాదం

- వరద నీటిలో చిక్కుకున్న భక్తుల కారు.. ట్రాక్టర్‌తో సురక్షితంగా బయటకు



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 09 2026:** ఏన్కూరు మండలం నాచారం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి సమీపంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వెళ్తున్న భక్తుల కారు భారీగా ప్రవహిస్తున్న వరద నీటిలో చిక్కుకుంది.

కారు వరద నీటిలో చిక్కుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక రైతులు వెంటనే స్పందించి ట్రాక్టర్ సాయంతో కారును వరద నీటి నుంచి సురక్షితంగా బయటకు లాగారు.

సకాలంలో స్థానికులు స్పందించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో కారులోని కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన స్థానిక రైతులను పలువురు అభినందించారు.

# అమరవీరుల స్తూప ఆవరణలో సుందరీకరణ

- స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచనలతో మొక్కల పెంపకం
- షాద్‌నగర్ తాలూకా జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో





**సి కే న్యూస్ షాద్ నగర్ :ఆగస్టు 9:**షాద్‌నగర్ పట్టణంలోని అమరవీరుల స్తూప ఆవరణను ఆహ్లాదకరమైన, పచ్చని వాతావరణంతో సుందరీకరించే కార్యక్రమం శనివారం ప్రారంభమైంది.స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ గారి సూచనల మేరకు, సాఫ్ట్ ల్యాండ్ స్కేపింగ్ కాంట్రాక్టర్ వెంకటయ్య యాదవ్ ఆధ్వర్యంలో వివిధ రకాల అలంకరణ మొక్కలు మరియు చెట్లు నాటడం జరిగింది.

ఈ సందర్భంగా విచ్ మీడియా గోల్డ్, మాల్ఫీజియా కోన్స్, మైక్రో కార్ప బాల్స్, ఫ్లవరింగ్ యజ్జోర, పాండనాస్, ఐరన్ హెడ్జ్ బార్డర్ తదితర అరుదైన రకాల మొక్కలను ఆవరణలో ఏర్పాటు చేశారు.ఈ మొక్కలు ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు కాలుష్యాన్ని నివారిస్తూ, స్వచ్ఛమైన గాలిని అందించడమే కాకుండా, చూసే వారికి కంటికింపుగా, శరీరంలోని అన్ని భాగాలకు ఆరోగ్య సంజీవనిలా ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. షాద్‌నగర్‌లో మరెక్కడా లేని విధంగా అమరవీరుల స్తూప ఆవరణ ఇలా అభివృద్ధి చెందడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఉన్న ఈ స్తూప ఆవరణను మరింత అందంగా తీర్చిద్దుతామని, ప్రజలు ఇక్కడికి వచ్చి ప్రశాంతంగా గడిపేలా చర్యలు తీసుకుంటామని జేఏసీ నాయకులు అన్నారు.ఈ కార్యక్రమాన్ని షాద్‌నగర్ తాలూకా జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

కార్యక్రమంలో మూలే జనార్ధన్ షాద్‌నగర్ తాలూకా జేఏసీ చైర్మన్,త్రిప్పిశెట్టి కరుణాకర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్,నక్క బాల్ రాజ్ యాదవ్ జేఏసీ కన్వీనర్,దంగ్ శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,బాదేపల్లి సిద్ధార్థ పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి రాజు సిఐటియు నాయకులు,గోర్ల రాము ట్రెజరర్,భగవాన్ దాసు, నాయిని నర్సింలు, దన్నాడ వెంకట యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దయానంద విద్యామందిర్‌లో 88వ ఉచిత వైద్య శిబిరం



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని వేదనగర్‌లో దయానంద విద్యామందిర్ ఆధ్వర్యంలో 88వ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పుట్ట శ్రీనివాస్ ఆర్య ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్యామ్, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ జయరాజు హాజరై చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన పరీక్షలు నిర్వహించడంతో పాటు, అనారోగ్య సమస్యలకు తగిన వైద్య సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా ప్రస్తుత సీజన్‌లో చిన్నారులకు వచ్చే జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి తదితర సీజనల్ వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

చిన్నారులకు పరిశుభ్రమైన ఆహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని తెలిపారు. పిల్లల్లో అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు.

ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హరినాథ్ రెడ్డి ,హరి చరణ్, సత్య కుమార్, సంపత్ కుమార్, గోపి మాస్టర్, కిరణ్, కళ్యాణ్, సఫారీ రామచందర్ తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మల్లారంలో యాప్ రాకను ఆసరాగా 'ఆర్గానిక్ డీఏపీ' అమ్మకాలు

- అనుమతులు ఉన్నాయా.. నాణ్యతపై స్పష్టత ఏదీ?
- తనిఖీలు చేపట్టాలని రైతుల డిమాండ్

**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఆగస్టు 09 2026:** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామంలో కొంతమంది వ్యక్తులు తిరుగుతూ 'ఆర్గానిక్ డీఏపీ' పేరుతో ఎరువులను విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఎరువుల విక్రయాలకు సంబంధించిన యాప్ అందుబాటులోకి రావడాన్ని ఆసరాగా చేసుకుని గ్రామాల్లో విక్రయాలు సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ ఎరువుల విక్రయాలకు సంబంధించి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సదరు ఉత్పత్తికి వ్యవసాయ శాఖ లేదా సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? తయారీ సంస్థ ఏది? ఉత్పత్తి నాణ్యతకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉన్నాయా? ప్యాకెట్‌పై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ, ధర తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

మరోవైపు, ఎరువుల పేరుతో గుర్తుతెలియని ఉత్పత్తులను విక్రయిస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పంటల సాగు సమయంలో ఎరువుల నాణ్యత విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

మల్లారం గ్రామంలో జరుగుతున్నట్లు చెబుతున్న 'ఆర్గానిక్ డీఏపీ' విక్రయాలపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఉత్పత్తి అనుమతులు, నాణ్యత, విక్రయదారుల వివరాలను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. అధికారుల తనిఖీల అనంతరం అసలు విషయం వెలుగులోకి వస్తుందని వారు ఆశిస్తున్నారు.






**ఆదిలాబాద్ జిల్లా సి.కే న్యూస్ ప్రతినిధి....**ఇచ్చోడ మండల కేంద్రంలో గల స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ కిషన్ చవాన్ ఆధ్వర్యంలో.... ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాఠశాల కళాశాల లోని విద్యార్థులచే.. ఆదివాసి వీరులు కొమురం భీమ్, బీర్స ముండా వేషధారణలతో పాఠశాల నుండి ర్యాలీగా బయలుదేరి... మండల కేంద్రంలోని కొమరం భీం చౌక్ వరకు ర్యాలీగా వచ్చి... కొమురం భీ విగ్రహానికి స్థానిక సర్పంచ్ కొడప జలై జాకు, ఆదివాసి నాయకులు ఆత్రం మహేందర్, దేవరావు, భీమ్రావు, జగపతి, పాఠశాల అధ్యాపక బృంద సభ్యులు, తది తరులతో కలిసి కొమురం భీం విగ్రహానికి పాలభిషేకం చేసి పూల హారాల వేసి గొప్ప నివాళులు అర్పించారు... ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... రాబోయే తరాలకు దేశం కోసం ప్రాంతం కోసం అమరులైన కొమరం భీమ్, బిర్స ముండ, అమరవీరుల త్యాగాలను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని... తెలిపారు.

# కొమరం భీమ్ ఆశయాలతో ఆదివాసీల హక్కుల పరిరక్షణ...

- ఆత్మగౌరవం, భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి: మంత్రి సీతక్క..
- ఆదివాసీ యువత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి....



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 09,**అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ

అశ్వారావుపేట: కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర మంత్రి దానసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని ఆదివారం మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జీవన విధానమే వారి అస్థిత్వమని పేర్కొన్నారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమ మూలాలను, మాతృభాషను, సంస్కృతిని మరచిపోవద్దని సూచించారు.

'జల్, జంగల్, జమీన్' స్ఫూర్తితో ముందుకు సాగాలి

కొమరం భీమ్ 'జల్, జంగల్, జమీన్' నినాదంతో పోరాడారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన అంశాలుగా నిలిచాయని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు విద్య, ఉపాధి, భూమి, అటవీ హక్కులు, గృహాలు వంటి ప్రాథమిక అవసరాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఆదివాసీ ప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని సూచించారు. పేదలు, నిరక్షరాస్యులు తమ సమస్యలతో వచ్చినప్పుడు ఓపికగా విని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటికే వివిధ శాఖల ద్వారా సుమారు రూ.1,200 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఆదివాసీ యువత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సీతక్క ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే

ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు తెలియజేసేలా మ్యూజియం, గిరిజన విద్యా వికాస భవనం ఏర్పాటుకు సహకరించాలని మంత్రి సీతక్కను కోరారు.

ఆదివాసీ సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. కొమరం భీమ్, రాంజీ గోండు, సమ్మక్క--సారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ పరిరక్షణతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమానికి ముందు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్సులతో మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విద్యాచందన, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా జరిగిన పద్మశాలి ఎన్నికలు

**బోట్ సికే న్యూసు**బోథ్ పట్టణంలో జరిగిన ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంగం అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

ఈ ఎన్నికల్లో బోథ్, నేరేడిగొండ, ఇచ్చోడ, బజారుహత్నూర్, సోనాల మండలాలకు చెందిన పద్మశాలి ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మొత్తం ఐదు మండలాల్లో 874 మంది పద్మశాలి ఓటర్లు ఉండగా, వారిలో 534 మంది ఓటు హక్కును వినియోగించుకొని 61% పోలింగ్ నమోదైంది.

ఈ ఎన్నికల నిర్వహణను బోథ్ సర్పంచ్ శ్రీ కుర్మే అన్నపూర్ణ మహేందర్ గారు పర్యవేక్షించారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని మండలాల పద్మశాలి కులబాంధవులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



# ముమ్మరంగా దోమల మందు పిచికారీ సర్పంచ్...



**మల్దకల్ ఆగస్టు 9:** జోగులంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్ద తాండ గ్రామంలో గుగ్లోత్ నారియనాయక్

పెద్దతండ:

గ్రామస్తుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పెద్దతండ గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు సర్పంచ్ గుగ్లోత్ నారియనాయక్ గారి ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధులు, మురుగు కాలువల వద్ద దోమల మందు (ఫాగింగ్) పిచికారీ చేయించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ నారియనాయక్ గారు స్వయంగా పర్యవేక్షిస్తూ, కొన్ని ప్రాంతాల్లో స్వహస్తాలతో మందును పిచికారీ చేసి గ్రామస్తుల్లో అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సర్పంచ్ స్వయంగా రంగంలోకి దిగి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తాలిపేరు ప్రాజెక్టు వద్ద 50 లీటర్ల నాటుసారా పట్టివేత...

ద్విచక్ర వాహనం సీజ్.. ఇద్దరు వ్యక్తుల అరెస్ట్...



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 09,**చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు పంప్‌హౌస్ సమీపంలో 50 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. నాటుసారాను తరలిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఐ సీహెచ్. శ్రీహరిరావు సిబ్బందితో కలిసి ఆదివారం తాలిపేరు ప్రాజెక్టు పంప్‌హౌస్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న ద్విచక్ర వాహనం (టీజీ 28 జే 0292)ను ఆపి తనిఖీ చేయగా ప్లాస్టిక్ డ్రమ్ములో 50 లీటర్ల నాటుసారా లభించింది.

దీనిని తోగ్గుడెం నుంచి చర్లకు తరలిస్తున్న పర్సిక సుధాకర్ (సీతయ్య కుమారుడు), పోడియం సాంబశివరావు (లక్ష్మయ్య కుమారుడు)లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని, ఇద్దరు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు రాజు, వీరబాబు, ప్రసన్నకుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంద. -డీసీసీ డా. నరేష్ జాదవ్



**ఆదిలాబాద్ జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి.....** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డీసీసీ డా. నరేష్ జాదవ్ గారు, మాజీ ఎంపీ సోయం బాపురావు గారితో కలిసి ఆదివాసీ వీరుడు కొమురం భీం గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం "ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా డీసీసీ డా. నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఈ దేశానికి, ప్రకృతికి నిజమైన సంరక్షకులని అన్నారు. అడవులు, జల వనరులు, ప్రకృతి సంపదను కాపాడుతూ తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమైందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక మంది ఆదివాసీ వీరులు ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. కొమురం భీం వంటి మహనీయుల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో ఘనమైనవని డా. నరేష్ జాదవ్ గారు అన్నారు. వారి ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

ఆదివాసీల హక్కులను పరిరక్షించడంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి గారు, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ గారు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుఆనందరావు గారు , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్ గారు,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాంతన్ రావు గారు, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ మంగేష్ దేవతాడే గారు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దేవదాస్ చారి గారు, బానోత్ ప్రనీత గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా గారు యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు నాహిద్ గారు, యూత్ కాంగ్రెస్ బోత్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతా రెడ్డి గారు, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుగత్ గారు, యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి గారు,గుడి హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దౌలత్ రావు గారు, ఖాడే సంతోష్ గారు ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వృద్ధాప్య, బీడీ పెన్షన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారు సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పెన్షన్ మొత్తాన్ని రూ.200 నుంచి రూ.2,000కు పెంచడంతో పాటు వృద్ధాప్య పెన్షన్ వయస్సును 57 సంవత్సరాలకు తగ్గించారు. అదే విధంగా బీడీ కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు తదితర అర్హులైన వారికి వివిధ రకాల పెన్షన్లు మంజూరు చేశారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పెన్షన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే వృద్ధాప్య మరియు బీడీ పెన్షన్లకు మాత్రం దరఖాస్తు చేసుకోవద్దని చెప్పడం తీవ్రంగా బాధాకరం.

వయస్సు పైబడిన పండుటాకులు, బీడీ కార్మికులు కూడా ప్రభుత్వ సంక్షేమానికి అర్హులే. వారికి పెన్షన్లు ఎందుకు ఇవ్వడం లేదు? కొత్తగా అర్హులైన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఎందుకు కల్పించడం లేదు?

కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వృద్ధాప్య, బీడీ పెన్షన్లకు కూడా దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు ప్రజల తరపున మా పోరాటం కొనసాగుతుంది.

తుల హరీష్ కుమార్
6వ వార్డ్ నంబర్ । దీ=హా నాయకులు

## 20 ఏళ్ల తర్వాత కలిసిన 2006 ౼ూజ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని: 2006లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చింతకాని మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2006 ౼ూజ బ్యాచ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఉపాధ్యాయులను సత్కరించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. రెండు దశాబ్దాల తర్వాత తమ విద్యార్థులను ఒకే చోట కలుసుకోవడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని, 20 ఏళ్ల తర్వాత కూడా తమను గుర్తు చేసుకుని ఆహ్వానించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమ జీవితాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ బాల్యంలోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠశాల రోజుల్లో స్నేహితులతో కలిసి గడిపిన క్షణాలు, సరదా సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. చాలాకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది.

ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని కొనసాగిస్తూ, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. "20 ఏళ్లు గడిచినా మా స్నేహం, మా పాఠశాలతో ఉన్న అనుబంధం ఏమాత్రం తగ్గలేదు. మాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను 20 ఏళ్ల తర్వాత సన్మానించుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి. మా గురువుల ఆశీర్వాదాలు ఎప్పటికీ మాకు మార్గదర్శకంగా నిలుస్తాయి" అని తెలిపారు.

కార్యక్రమంలో 2006 ౼ూజ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వేములపల్లి లో శ్రీ కనకదుర్గమ్మ ఆషాడ బోనాల జాతర మహోత్సవం



**నల్గొండ జిల్లా సికే న్యూస్ ప్రతినిధి:** నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని శ్రీ చక్ర కనకదుర్గ మల్లేశ్వర దేవాలయంలో ఆషాడ బోనాల జాతర ఆలయ ట్రస్ట్ చైర్మన్ ధర్మకర్త బద్దం సరితమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఉదయాన్నే గ్రామ దేవతలకు పూజా కార్యక్రమాలతో మొదలై ఆషాడ బోనాల ఘనంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి గ్రామ సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెదమాం భరత్, దైద ప్రేమ్ కుమార్, పగడాల చందు, విష్ణు, మధు, వీరస్వామి, నిమ్మనగోటి మహేష్ ఇరుగుదిండ్ల నరేష్, కంకణాల కుమార్ రమేష్, వెంకటమ్మ, కొల రవి,సతీష్ శివ మధు మహేష్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ హమాలీ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.




సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లు గౌతంరెడ్డి

**నల్గొండ జిల్లా సికే న్యూస్ ప్రతినిధి** నల్గొండ జిల్లాలోని ఏడు బస్ డిపోలో పరిధిలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఈఎస్ఐ పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లు గౌతమ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు స్థానిక బస్టాండ్ లో హమాలీ పని చేస్తున్న కార్మికులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. హమాలీ కార్మికులు ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారని ఐదు కేజీల బరువును వస్తువులకు హమాలీ ఈయటం లేదని ఇది పూర్తిగా కార్మికులను దోచుకునే చర్య అని విమర్శించారు. ప్రస్తుతం వివిధ బస్టాండ్ పరిధిలో గల పార్సల్ కేంద్రాలను పూర్తిగా అవేజె సంస్థకు ప అప్పుజెప్పేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందని దీన్ని తమ సంఘం వ్యతిరేకిస్తుందని తెలిపారు. పార్సల్ కేంద్రాల వద్ద గతంలో ఆర్టీసీ సిబ్బంది పని చేయించే వారిని ప్రస్తుతం వారి స్థానంలో ప్రైవేటు వారితో నడిపిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పరం చేస్తే ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీలను తొలగించే ప్రమాదం ఉందని అలా కాకుండా పనిచేస్తున్న వారినే కొనసాగించాలని ఆయన తెలిపారు. ఈ పరిస్థితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 97 బస్ డిపోలలో జరుగుతుందని ఇది పూర్తిగా కార్మిక వ్యతిరేకమైందని వారు తెలిపారు. యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయాలని వారికి ఈఎస్ఐ పీఎఫ్ వంటివి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటుగా హమాలీలు రామకోటయ్య సురేష్ ఎల్లయ్య కృష్ణయ్య యాదయ్య వెంకన్న వీరయ్యలు ఉన్నారు.

## వేముల నర్సయ్యను పరామర్శించిన కోమట్లగూడెం గ్రామస్తులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. నర్సయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వేముల నర్సయ్య త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ఆయనకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తామంతా అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోమట్లగూడెం సర్పంచ్ కొండూరి పరిశుద్ధరావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అవులూరి లక్కిరెడ్డి, కొండూరి జయరాజు, కొండూరి జోషి, కొండూరి ఏసుబాబు, కొండూరి ఏసురత్నం, కొండూరి విజయరావు, కొండూరి సురేష్, కొరివి జెమిస్, కొరివి జోషి, కొరివి జులోన్, సూరేపల్లి కాటయ్య, సూరేపల్లి చిన్నగోపయ్య, బలవంతపు చిన్న కృష్ణ, బలవంతపు పెద్ద కృష్ణ, మొండితోక ఫ్రాన్సిస్, తిరుమలకొండ శంకర్, కొరివి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రమ్మ చిత్రపటానికి నేతల నివాళి.

- వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల హాజరు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** కాంగ్రెస్ నాయకులు యల్లంపల్లి సతీశ్ మాతృమూర్తి యల్లంపల్లి సావిత్రమ్మ దశదిన కార్యక్రమం నాగులవంచలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరై సావిత్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, సావిత్రమ్మ మృతికి సంతాపం తెలిపారుకార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడిపూడి బుచ్చిరామయ్య, టీడీపీ మండల అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు, నాగులవంచ ఉపసర్పంచ్ అంబటి శరత్ కుమార్, వంకాయలపాటి సత్యనారాయణ, అంబటి శాంతయ్య, సామినేని అప్పారావు, కందరబోయిన కొండలు తదితరులు పాల్గొన్నారు. అలాగే రిపోర్టర్లు చావా అరుణ్ కుమార్, నన్నాక అప్పారావు, ఐనాల నాగేశ్వరరావు, నల్లమోతు ప్రభాకర్, నెల్లూరి రమేష్, కన్నీటి శ్రీను తదితరులు హాజరై నివాళు లర్పించారు.

## అక్రమ మద్యం విక్రయంపై పోలీసుల దాడి,

- టీ పాయింట్‌లో రూ.3,390 విలువైన మద్యం స్వాధీనం ఒకరి అదుపులోకి,

**షాద్ నగర్ నియోజకవర్గ సీకే న్యూస్ ప్రతినిధి,ఆగస్టు 9:** కొత్తూరు మండలం ఇన్ముల్నార్వ గ్రామంలోని ఎంఎస్ టీ పాయింట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఎస్ఐ సత్యశీలా రెడ్డి ఆధ్వర్యంలో పెట్రోలింగ్ సిబ్బంది టీ పాయింట్ వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు తనిఖీల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలు పోలీసుల కంటపడ్డాయి దీంతో దుకాణ యజమాని కొర్ర కళ్యాణ్ (ఇన్ముల్నార్వ గ్రామం,కొత్తూరు మండలం)ను అదుపులోకి తీసుకుని విచారించారు అనంతరం సాక్షుల సమక్షంలో కన్ఫెషన్ కమ్ సీజ్ పంచనామా నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలు డెక్కన్ బ్లూ విస్కీ -- 180 మి.లీ చొప్పున 17 సీసాలు కింగ్‌ఫిషర్ ప్రీమియం బీర్ -- 650 మి.లీ చొప్పున 12 సీసాలు మొత్తం మద్యం పరిమాణం సుమారు 10.86 లీటర్లు అంచనా విలువ: రూ.3,390/- ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర



భక్తిశ్రద్ధలతో బోనాలు, సమర్పించిన భక్తులు.

**ఆగస్టు 09 (సీ కే న్యూస్)** చేగుంట మండల కేంద్రంలోని శ్రీశ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం కన్నులపండుగా సాగింది. పట్టణంలోని ప్రతి ఇంటి నుండి మహిళలు సంప్రదాయబద్ధంగా శోభాయమానంగా అలంకరించిన బోనాలను శిరస్సున ధరించి, ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

?బోనాల శోభాయాత్రతో చేగుంట పట్టణంలో పెద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ బోనాల జాతర మహోత్సవాన్ని చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ కుటుంబం తమ సొంత నిధులతో ఎంతో ఘనంగా జరిపిస్తున్నారు. అమ్మవారి ఉత్సవాన్ని చూడటానికి, దర్శించుకోవడానికి చేగుంట పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల నామస్మరణలు, బోనాల కోలాహలంతో భక్తిపారవశ్యంలో మునిగితేలింది.

?ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉసికే శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు పోరండ్ల రాఘవేంద్ర శర్మ, క్యాషియర్ గడ్డమీద బాలేష్, సంద్రుగు రవి, మాసుల శ్రీనివాస్, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, వార్డ్ నెంబర్లు తలారి నాగరాణి లింగం, ఆకుల సుఖేందర్, మురాడి ఉదయ్, సంద్రుగు శ్రీకాంత్, సతీష్, సంపత్, సాదుల్ల, పరంజ్యోతి, మంచి కట్ల శ్రీనివాస్, అయిత వెంకటలక్ష్మి రఘురాములు, సంద్రుగు స్వామి, వడ్ల యాదగిరి, చింతల సిద్ధిరాములు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తైక్వాండో గిన్నిస్ వరల్డ్ రికార్డ్'లో టేకుల గూడెంకు చెందిన మాతంగి.ప్రవీణ్




**సి కె న్యూస్ ఆగస్టు 9 ఆదివారం అనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన తైక్వాండో మాస్టర్,మాతంగి.ప్రవీణ్ బ్లాక్ బెల్ట్ మూడవ డాన్ ఈ'గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. తైక్వాండో క్రీడా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ, ప్రపంచ స్థాయిలో నిలిచిపోయేలా'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' సాధించేందుకు నిర్వహించినట్లు 30 సార్లు గిన్నిస్ రికార్డు సాధించిన గ్రాండ్ మాస్టర్ ఎం.జయంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ భారీ 'లార్జెస్ట్ తైక్వాండో లెసన్' రికార్డు ప్రయత్నం జరిగిందని తెలిపారు. తైక్వాండో క్రీడలోని క్రమశిక్షణ, ఐక్యత, మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు ఒకే వేదికపైకి వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించారని చెప్పారు.

# ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించిన...



**మల్దకల్, ఆగస్టు09:** మల్దకల్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఘనంగా నిర్వహించారు. మల్దకల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, యువజన నాయకుడు తిమ్మప్ప నాయుడు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో తిమ్మప్ప నాయుడు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.
అనంతరం తిమ్మప్ప నాయుడు మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో మరియు ప్రజాస్వామ్య పరిరక్షణలో యువజన కాంగ్రెస్ పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. యువత అంతా దేశ పురోభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో యువతను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజాపక్ష పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన చెప్పారు.
ఈ కార్యక్రమంలో మల్దకల్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆర్థిక సహాయం



**బోత్. సీకే న్యూస్....** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిందేకర్ చందు కుటుంబానికి తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అండగా నిలిచింది. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.
ఈ ఆర్థిక సహాయాన్ని మాజీ ఎంపీపీ, తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ తుల శ్రీనివాస్ సొసైటి సభ్యుల ద్వారా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం పంపడం జరిగింది .
ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఇర్ల అభిలాష్, తుల హరీష్, గాజుల సుగుణకర్, కోస్మెట్టి శరత్, లక్కకుల మహేందర్ పాల్గొన్నారు.
ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, మానవత్వంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను పలువురు అభినందించారు.

# బస్ ఎక్కుతుండగా మొబైల్ చోరీ

- బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.55 లక్షలు మాయం!
- కొత్తూర్‌లో ఘటన గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు,




**షాద్ నగర్ నియోజకవర్గ సి కే న్యూస్ ప్రతినిధి,ఆగస్టు 09:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూర్ మండలంలో బస్‌స్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో ఓ వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసి అనంతరం అదే ఫోన్‌కు సంబంధించిన బ్యాంకింగ్ వివరాలను ఉపయోగించి ఖాతా నుంచి రూ. 1.55 లక్షలు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసిన ఘటన కొత్తూర్‌లో కలకలం రేపింది.
వివరాల ప్రకారం కొత్తూర్ గ్రామంలోని మల్లికార్జున కాలనీకి చెందిన లింగాల జగన్ గౌడ్ (తండ్రి బుచ్చయ్య) ఈ నెల 21న ఉదయం 9 గంటల సమయంలో విధులకు వెళ్లేందుకు కొత్తూర్ బస్‌స్టాండ్‌కు చేరుకున్నారు ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆయన మొబైల్ ఫోన్‌ను చోరీ చేసి అక్కడి నుంచి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు
అనంతరం జూలై 23 నుంచి 26వ తేదీ వరకు ఆయన బ్యాంకు ఖాతా నుంచి వేర్వేరు బ్యాంకు ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా మొత్తం రూ. 1,55,000 బదిలీ అయినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు మొబైల్ చోరీకి బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీకి సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు ఆన్‌లైన్ లావాదేవీల వివరాలను సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# బోనాల పండుగ సందర్భంగా ప్రజావాణి రద్దు.



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 09** బోనాల పండుగ సందర్భంగా సోమవారం (ఆగస్టు 10) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
ప్రభుత్వ సెలవు నేపథ్యంలో జిల్లా అధికారులు అందుబాటులో ఉండరని, దీంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు 10న ఐడీఓసీ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ సూచించారు.

## కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్....ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



### ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**నల్గొండ జిల్లా సీకే న్యూస్ జిల్లా ప్రతినిధి:** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ నందు మిర్యాలగూడ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -పాల్గొన్నారు ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్ యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి యల్ ఆర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవా రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఐక మత్యంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ, యువత ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలని ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు షేక్ హాజరుద్దీన్ కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలకృష్ణ నూకల వేణుగోపాల్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ లు మోయిజ్ కోడిరెక్క ఇంద్ర కుమార్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# దొడ్డి దారిన పదవులు పంచుతున్న కాంగ్రెస్ పార్టీ



- గ్రాజా ఎన్నికలంటే వనుకా లేక ప్రజాస్వామ వ్యవస్థ అంటే చిన్న చూపా
- ఓటమి భయం తోనే ఎన్నికలకు దూరం, రైతులు ప్రభుత్వానికి కాల్చి వాతలు పెట్టే పరిస్థితి ఉంది కాబట్టి దొడ్డి దారిన పదవులు పంచుతున్న కాంగ్రెస్ పార్ట
- ప్రభుత్వం పై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ధ్వజం...!

**షాద్నగర్ నియోజకవర్గం సీ కే ప్రతినిధి ఆగస్టు 9 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను కాపాడే అత్యంత కీలకమైన సహకార వ్యవస్థలు. రైతుల భాగస్వామ్యం, సభ్యత్వం, వాటా హక్కులు, ఓటు హక్కుల ఆధారంగా ఈ సంఘాలు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగాలి. అలాంటి వ్యవస్థలో ఎన్నికల ద్వారా పాలకవర్గాన్ని ఎన్నుకునే హక్కును రైతుల నుంచి దూరం చేసి, నామినేటెడ్ విధానంలో పదవులను భర్తీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు.
ప్యాక్స్‌లో సభ్యులుగా ఉన్న వేలాది మంది రైతులకు తమ ఓటు ద్వారా డైరెక్టర్లను, చైర్మన్, వైస్ చైర్మన్ తదితర పాలకవర్గాలను ఎన్నుకునే హక్కు ఉంటుంది. ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా రైతులు తమకు నచ్చిన నాయకత్వాన్ని ఎన్నుకోవడమే కాకుండా, సంఘం పనితీరు, ఆర్థిక వ్యవహారాలు, రైతులకు అందుతున్న సేవలపై తమ అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేస్తారు.
అయితే ప్రస్తుతం ఎన్నికలకు వెళ్లకుండా అధికారాన్ని ఉపయోగించి తమకు అనుకూలమైన వ్యక్తులకు పదవులు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలు రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది నిజంగా జరిగితే, రైతుల ఓటు హక్కును పక్కనపెట్టి సహకార సంఘాలపై రాజకీయ నియంత్రణను పెంచే చర్యగా భావించాల్సి వస్తుంది.

**రైతుల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేదా?**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చింది. అయితే ఆ హామీల అమలుపై రైతుల్లో అసంతృప్తి నెలకొని ఉందనే చర్చ విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో, ప్యాక్స్ ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోంది? రైతుల తీర్పును ఎదుర్కొనేందుకు భయపడుతోందా? అనే ప్రశ్నలు సహజంగానేఉత్పన్నమవుతున్నాయి.
ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును స్వీకరించాల్సిందే. రైతులపై నమ్మకం ఉంటే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించి, రైతుల ఓట్లతో తమకు అనుకూలమైన పాలకవర్గాలను గెలిపించు కోవాలి. ఎన్నికల్లో గెలవాల్సిన స్థానాలను అధికార బలంతో నామినేషన్ ద్వారా భర్తీ చేయడం ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం కాదు.

**సహకార వ్యవస్థను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చొద్దు**

ప్యాక్స్‌లు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన సంస్థలు కావు. అవి రైతుల సంస్థలు.రైతుల సభ్యత్వం,వాటా సొమ్ము,కృషి, నమ్మకంతో ఏర్పడిన సహకార వ్యవస్థలు.కాబట్టి వీటి పాలకవర్గాలను కూడా రైతులే ఎన్నుకోవాలి.
రాజకీయంగా తమకు అను కూలంగా ఉన్న వ్యక్తులకు పదవులు కట్టబెట్టడం ద్వారా సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడం తగదు. అలా చేస్తే భవిష్యత్తులో రైతుల భాగస్వామ్యం, సంఘాలపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది.

**ఎన్నికలే ప్రజాస్వామ్యానికి సరైన మార్గం**

గతంలో రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్యాక్స్ పాలకవర్గాలను ఎన్నుకుంటూ వచ్చారు. ఎన్నికల ద్వారా వచ్చిన పాలకవర్గాలు రైతులకు జవాబుదారీతనంతో పనిచేయాల్సి ఉంటుంది. నామినేటెడ్ విధానంలో పదవులు పొందిన వారికి రైతుల ఓటు ద్వారా వచ్చిన ప్రజా మద్దతు ఉండదు.
అందువల్ల ప్రభుత్వం తక్షణమే ఏకపక్ష నిర్ణయాలను పునరాలోచించాలి. రైతుల హక్కులను గౌరవిస్తూ ప్యాక్స్ ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలి.

**ప్రభుత్వానికి మా డిమాండ్లు**

1. ప్యాక్స్ పాలకవర్గాల నామినేటెడ్ నియామకాలపై తీసుకున్న నిర్ణయాలను తక్షణమేఉపసంహరించుకోవాలి
2. అర్హత కలిగిన ప్యాక్స్ సభ్యులందరికీ స్వేచ్ఛగా ఓటు వేసే హక్కును కల్పించాలి
3. ప్యాక్స్ ఎన్నికలపై స్పష్టమైన ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాలి
4. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, రాజకీయ జోక్యానికి తావులేకుండా నిర్వహించాలి
5 రైతుల సభ్యత్వం, వాటా, ఓటుహక్కులకుసంబంధించిన వివరాలను పారదర్శకంగా అందుబాటులో ఉంచాలి
6 సహకార సంఘాలను రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా రైతుల ప్రయోజనాల కోసం నిర్వహించాలి

రైతులపై నిజమైన విశ్వాసం ఉన్న ప్రభుత్వం అయితే రైతుల తీర్పును ఎదుర్కోవడానికి వెనుకాడాల్సిన అవసరం లేదు ఎన్నికల్లో గెలిచిపాలక వర్గాలను ఏర్పాటు చేసు కోవాలి.అధికారాన్ని అడ్డుపెట్టుకొని పదవులు పంచుకోవడం ప్రజాస్వామ్యం కాదని ప్రభుత్వం గుర్తించాలి రైతుల ఓటు హక్కును గౌరవించడం అంటే సహకార వ్యవస్థను గౌరవించడమే
ప్యాక్స్ రైతులది --- పాలకవర్గాన్ని ఎన్నుకునే హక్కు కూడా రైతులదే!

# బోనాల పండుగ సందర్భంగా గిరిజన దర్బార్ రద్దు.



**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ఆగస్టు 09,** బోనాల పండుగ సెలవు సందర్భంగా సోమవారం (ఆగస్టు 10) భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించాల్సిన గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
పండుగ సెలవు కారణంగా ఐటీడీఏ యూనిట్ అధికారులు అందుబాటులో ఉండరని, అందువల్ల గిరిజనులు సోమవారం దరఖాస్తులు సమర్పించేందుకు కార్యాలయానికి రావద్దని ఆయన సూచించారు.

# మక్తగూడ గ్రామంలో ఘనంగా మైసమ్మ పోచమ్మ బోనాలు

- అమ్మ దయ ప్రజలందరిపై ఉండాలి
- మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు



**షాద్నగర్ నియోజకవర్గం సీ కే న్యూస్ ప్రతినిధి ఆగస్టు 9**
రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలంలోని మక్తగూడ గ్రామపంచాయతీలో పరిధిలోని అమ్మవారి ఆశీస్సులు,దయ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని,అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని పంటలు సంపూర్తిగా పండాలని వర్షాలు బాగా కురవాలని మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు ఆకాంక్షించారు. ఆదివారం కొత్తూరు మండలంలోని మక్తగూడ గ్రామంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా సర్పంచ్ బోకుల శ్రీరాములు ఆధ్వర్యంలో పోచమ్మ,మైసమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక మొక్కుబడులు చెల్లించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములు గౌడ్,మాజీ సర్పంచ్ కాట్నా రాజు,గ్రామ కమిటీ అధ్యక్షుడు దయ్యాల మల్లేష్, వార్డు సభ్యులు బోకుల రాజు, దయ్యాల శ్రీను,కాట్న యశోద, కాసారం శ్రీను,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఆదివాసీల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంద. -డీసీసీ డా. నరేష్ జాదవ్

**ఆదిలాబాద్ జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి.....** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డీసీసీ డా. నరేష్ జాదవ్ గారు, మాజీ ఎంపీ సోయం బాపురావు గారితో కలిసి ఆదివాసీ వీరుడు కొమురం భీం గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం "ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా డీసీసీ డా. నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఈ దేశానికి, ప్రకృతికి నిజమైన సంరక్షకులని అన్నారు. అడవులు, జల వనరులు, ప్రకృతి సంపదను కాపాడుతూ తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమైందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక మంది ఆదివాసీ వీరులు ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. కొమురం భీం వంటి మహనీయుల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో ఘనమైనవని డా. నరేష్ జాదవ్ గారు అన్నారు. వారి ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

ఆదివాసీల హక్కులను పరిరక్షించడంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి గారు, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ గారు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుఆనందరావు గారు , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్ గారు,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాంతన్ రావు గారు, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ మంగేష్ దేవతాడే గారు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ దేవదాస్ చారి గారు, బానోత్ ప్రనీత గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా గారు యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు నాహిద్ గారు, యూత్ కాంగ్రెస్ బోత్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతా రెడ్డి గారు, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుగత్ గారు, యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి గారు,గుడి హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దౌలత్ రావు గారు, ఖాడే సంతోష్ గారు ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# స్టేజ్ ఫ్లెక్సీలో ఎమ్మెల్యే, సర్పంచ్ ఫొటోలు కరువు!

**ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్‌పై చర్చ.**




**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం ప్రతినిధి ఆగస్టు 09,** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమానికి ఏర్పాటు చేసిన స్టేజ్ ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం ప్రథమ పౌరుడు, సర్పంచ్ పూనెం కృష్ణదొర ఫొటోలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ప్రజాప్రతినిధుల ఫొటోల కు స్థానం కల్పించాల్సి ఉండగా, కార్యక్రమానికి హాజరుకాని కొందరు ప్రజాప్రతినిధుల ఫొటోలు ఫ్లెక్సీలో ఉండటం, స్థానిక ఎమ్మెల్యే, సర్పంచ్ ఫొటోలు లేకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీ దినోత్సవం వంటి అధికారిక కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఎలాంటి వివరణ ఇస్తారో వేచి చూడాలి.

# భక్తి శ్రద్ధలతో వెలిగిన బోనాలు

**జై మహంకాళినినాదాలతో మార్మోగిన ప్రజలు**



**ఆగస్టు 09 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండలం వడియారం గ్రామంలో ఆషాడ మాసం సందడి వడియారం గ్రామాన్ని భక్తి మయం చేసింది. ఆదివారం గ్రామంలోని మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

తెల్లవారుజాము నుంచే ఇంటింటి మహిళలు కొత్త కుండల్లో బోనాలను అలంకరించి, పసుపు కుంకుమలతో, పూలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. "బోలో మహంకాళి మాత కీ జై" అంటూ భక్తుల జయజయధ్వానాలతో వీధులన్నీ ప్రతిధ్వనించాయి.

ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

బోనాల ఊరేగింపు, భజనలతో గ్రామమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.

## ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా భారీ త్రాగు నీటి ప్రాజెక్టు ప్రారంభం



**అనకాపల్లి జిల్లా(సీ కే న్యూస్)** ఎలమంచిలి మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ సీఎం రమేష్ ఎలమంచిలి నియోజవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కూటమినాయకులు..

రూ. 128 కోట్ల భారీ తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన,

ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల యలమంచిలి నందు అదనపు తరగతుల భవన నిర్మాణమునకు భూమిపూజ అంచనా విలువ రూ. 1కోటి,

ఎలమంచిలి మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా అందించేందుకు సుమారు రూ. 128 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఎంపీ సీఎం రమేష్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబు. మెగా తాగునీటి ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఎలమంచిలి పట్టణంలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో ఎలమంచిలి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల భవనాల అభివృద్ధిని పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.

కొండకర్ల ఆవను ఫారెస్ట్‌గా అభివృద్ధి చేశామని, అచ్యుతాపురం--అనకాపల్లి రోడ్డు పనులను పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ఎలమంచిలి నియోజకవర్గంలో

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కొళాయిలు అందించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. ఎలమంచిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

తనను ఎమ్మెల్యేగా . గెలిపించిన ఎలమంచిలి నియోజకవర్గ ప్రజలకు సుందరపు విజయ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జరగకపోవడంతోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించారని, ప్రజల తీర్పు స్పష్టంగా ఉందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆయన అన్నారు,ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ పీ చంద్రశేఖర్, జనసేన పార్టీ,ఎంపీపీ రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు బోద్దపు శ్రీను, గుర్రాల శేఖర్,కార్యకర్తలు పతివాడ గణేష్, ఊ టకూటి రమేష్ నాయుడు, కొటార్ శ్రీనివాస్ మాస్టర్, లంక ఉదయ్, భోజ జయరాం, కొటారి బాబ్జి, కొటారి నరేష్, పళ్ళ సత్యనారాయణ, , లాలం నాయుడు, జనసేన వీర మహిళ కర్రి ఝాన్సీ,గొర్రెల నానాజీ, పప్పు ఈశ్వరరావు, రాజాన సత్యనారాయణ, కూటమి నాయకులు తదిరులు పాల్గొన్నారు.

# భోపాల్‌లో తెలంగాణ కెనోయ్ స్ప్రింట్ జట్టు సత్తా

**జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పలు పతకాలు కైవసం**



**సి కే న్యూస్ భోపాల్ :** భోపాల్‌లో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించిన" అస్మిత్ కెనోయ్ స్ప్రింట్ నేషనల్ ఛాంపియన్‌షిప్"లో తెలంగాణ కెనోయ్ స్ప్రింట్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించారు. 1000 మీటర్ల విభాగంలో తెలంగాణ క్రీడాకారులు విశేషంగా రాణించారు. కెనోయ్ సింగిల్: వెండి పతకం -- ఎన్. బిందు,కెనోయ్ డబుల్: బంగారు పతకం -- పి. జస్విక, కె. అనూష,కెనోయ్ ఫోర్: ? బంగారు పతకం -- కె. బిందు, పి. జస్విక, ఆర్. రేఖ, కె. అనూష,కయాక్ సింగిల్: కాంస్య పతకం -- ఎం. చందన్,కయాక్ ఫోర్: వెండి పతకం -- ఎం. చందన్, శ్రావంతి, అవంతిక, సింధు,500 మీటర్ల విభాగంలో కూడా తెలంగాణ జట్టు విజయ పరంపరను కొనసాగించింది. కెనోయ్ సింగిల్: వెండి పతకం -- కె. అనూష,కెనోయ్ డబుల్: బంగారు పతకం -- ఎం. బిందు, పి. జస్విక,జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు కనబరిచిన ఈ ప్రతిభ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. క్రీడాకారుల కఠోర శ్రమ, పట్టుదల, సమష్టి కృషికి ఈ పతకాలు నిదర్శనంగా నిలిచాయి. ఈ సందర్భంగా పతక విజేతలను, కోచ్‌లు రామకృష్ణ నిషి మరియు సహాయక సిబ్బందిని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అభినందించింది.

రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శనతో తెలంగాణకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించింది.

# కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు ముందస్తు సమాచారం



**అదిలాబాద్ జిల్లా సి.కే న్యూస్ ప్రతినిధి..** రేపు ఉదయం 10:00 గంటలకు రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సి విభాగం చైర్మన్ మరియు మాన కొండూరు ఎమ్మెల్యే శ్రీ కవ్వంపల్లి సత్యనారాయణ గారు ఆదిలాబాద్ కు విచ్చేస్తున్నారు

అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు ముందస్తు సమాచారం రేపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్న ఎస్సీ విభాగ ప్రత్యేక సమావేశం కు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ మరియు మాన కొండూరు ఎమ్మెల్యే శ్రీ కవ్వం పల్లి సత్యనారాయణ గారు మరియు జాతీయ ఎస్సీ విభాగం కోఆర్డినేటర్ శ్రీ సిద్ధార్థ్ హితంబ్రే గారు రేపు ఉదయం 10:00 గం.లకు విచ్చేస్తున్నారు, ఉదయం 10:00 లకు మొదటగా బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద పూలమాలవేసి అక్కడ నుండి ర్యాలీగా టీఎన్జీవోస్ హోమ్ కు విచ్చేస్తారు.కావున కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని

# వాటర్ స్పోర్ట్స్‌లో తెలంగాణ క్రీడాకారుల సత్తా




**మూడు రాష్ట్రాల్లో 18 పతకాలు కైవసం**

**సి కే న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ :** జాతీయ స్థాయిలో జరుగుతున్న వివిధ వాటర్ స్పోర్ట్స్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరుగుతున్న కానోయింగ్, రోయింగ్, స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు మొత్తం 18 పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారు.

కానోయీ స్ప్రింట్‌లో 8 పతకాలు

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతున్న "అస్మిత కానోయీ స్ప్రింట్ నేషనల్ చాంపియన్‌షిప్ సబ్-జూనియర్ "పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు 8 పతకాలు సాధించారు. 1000 మీటర్ల విభాగంలో ఎన్. బిందు కానోయ్ సింగిల్‌లో రజత పతకం సాధించారు. పి. జస్విక--కె. అనూష కానోయ్ డబుల్‌లో, కె. బిందు--పి. జస్విక--ఆర్. రేఖ--కె. అనూష కానోయ్ ఫోర్‌లో స్వర్ణ పతకాలు సాధించారు. కయాక్ సింగిల్‌లో ఎం. చందన్ కాంస్య పతకం, కయాక్ ఫోర్‌లో ఎం. చందన్--శ్రావంతి--అవంతిక--సింధు జట్టు రజత పతకం సాధించింది. 500 మీటర్ల విభాగంలో కె. అనూష కానోయ్ సింగిల్‌లో రజత పతకం, ఎం. బిందు--పి. జస్విక కానోయ్ డబుల్‌లో స్వర్ణ పతకం సాధించారు.

రోయింగ్‌లో 6 పతకాలు

పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో ఆగస్టు 5 నుంచి 10 వరకు జరుగుతున్న "27వ సబ్-జూనియర్ నేషనల్ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో" తెలంగాణ జట్టు 10 విభాగాల్లో పోటీపడి 3 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్యాలు సహా మొత్తం 6 పతకాలు సాధించింది. అండర్-13 బాలుర డబుల్ స్కల్స్‌లో ఎం. యశ్వంత్, ఎస్. శివరామ్; అండర్-13 బాలికల డబుల్ స్కల్స్‌లో ఛ. ధాత్రి, ఆర్. తరుణి; బాలికల సింగిల్ స్కల్స్‌లో ఏ. వర్షిత స్వర్ణ పతకాలు సాధించారు. బాలికల పెయిర్‌లో ఎస్. దేవేంద్రమ్మ, కె. లావణ్య రజత పతకం సాధించారు. బాలుర ఫోర్‌లో ఆమిర్, లాలు, నితిన్, టి. ఉపేంద్ర; బాలికల ఫోర్‌లో ఎన్. ఆరుషి, వి. అమని, వి. అక్షిత, ఆర్. నిహారిక కాంస్య పతకాలు సాధించారు.

స్విమ్మింగ్‌లో 2 పతకాలు

రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగుతున్న జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు మరో రెండు పతకాలు లభించాయి. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో ఆరుష్ దాస్ 29.44 సెకన్లలో రేసును పూర్తి చేసి కాంస్య పతకం సాధించారు. ఇది ఆయనకు తొలి జాతీయ స్థాయి పతకం కావడం విశేషం.

మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో శివాని కార్రా 1:01.28 సెకన్లలో రేసును పూర్తి చేసి రజత పతకం సాధించారు. ఇదే చాంపియన్‌షిప్‌లో శివాని అంతకుముందు ఒక స్వర్ణం, ఒక రజత పతకం సాధించారు

.క్రీడాకారులకు అభినందనలు

జాతీయ స్థాయిలో తెలంగాణకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన క్రీడాకారులను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి అభినందించారు. క్రీడాకారుల విజయాల వెనుక కృషి చేసిన కోచ్‌లను కూడా అధికారులు అభినందించారు. రోయింగ్ కోచ్‌లు ఇస్మాయిల్ బేగ్ (ద్రోణాచార్య అవార్డు గ్రహీత), ఒలింపియన్ మంజీత్ సింగ్ (ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత), జి. గీతాంజలి (స్పోర్ట్స్ స్కూల్--ఖేలో ఇండియా కోచ్), కానోయింగ్, కయాకింగ్ విభాగం కోచ్‌లు రామకృష్ణ, నిషి, స్విమ్మింగ్ కోచ్ ఆయుష్ యాదవ్ లను అభినందించారు. జాతీయ వేదికపై తెలంగాణ జెండాను రెపరెపలాడించిన క్రీడాకారులందరికీ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ హృదయపూర్వక అభినందనలు తెలిపింది. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించింది.

# ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు.




**కొర్రాజులగుట్ట పాఠశాలలో అపూర్వ కలయిక.**

**సి కె న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఆగస్టు 09,** భద్రాచలం: నన్నపనేని మోహన్ జడ్పీహెచ్ఎస్ కొర్రాజులగుట్ట పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2007--08 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన సుమారు 80 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదులు, బెంచీలు, ఆటస్థలాలను సందర్శించి సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు.

పాఠశాల అవసరాల కోసం కుర్చీలు, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పూర్వ విద్యార్థులు విరాళంగా అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాటలు, నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ప్రతి ఏడాది ఇదే విధంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవాలని నిర్ణయించారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కమిటీ సభ్యులు పొదిల రవితేజ, అంబటి సునీల్, గల్లా రవి, మాచర్ల కిరణ్, పావరాల వాయునందనరావు, గడ్డం శ్రీనివాస్‌లను అభినందించారు. ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసింది.

## అప్పుడు కలవనివ్వలేదు..

# ఇప్పుడు అదే హీరోతో!



మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది. '2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.

# పోలీసులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు



ప్రస్తుతం 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్.. వైజాగ్?లో కనిపించాడు. తన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ని ఘనంగా ప్రారంభించాడు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఇలా ఓ మల్టీప్లెక్స్ ఉండగా.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ లాంచ్ చేశాడు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు వైజాగ్ రోడ్డుపై అస్సలు నడవలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు. 'గంగోత్రి' రోజుల్లో వైజాగ్ రోడ్డుపై ఎవరూ నన్ను గుర్తుపట్టేవారు కాదు. ఇప్పుడు అదే రోడ్డుపై నడవలేకపోతున్నాను. 'రాకా' షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వైజాగ్ ప్రజల కోసం ఒక రోజు బ్రేక్ అడిగి వచ్చాను. అయితే పోలీసులు నన్ను ఎయిర్‌పోర్ట్ నుంచి పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు. వాళ్లకు థ్యాంక్స్' అని అన్నాడు. ఇక ఎదురుగా ఉన్న కొందరు అభిమానులు ఫొటో కావాలని అడగడంతో అందరూ ఇక్కడికి వచ్చేయండి అని స్టేజీపైకి ఆహ్వానించాడు. ఫ్యాన్స్‌కి నో అని చెప్పటం నా వల్ల కాదమ్మా అని అన్నాడు. ఎనిమిది స్క్రీన్లు ఉన్న ఈ మల్టీప్లెక్స్‌లో 'పుష్ప'లో గడ్డం కింద చేయి పెట్టే పోజు ఉన్న బన్నీ బొమ్మని ప్రదర్శన కోసం ఉంచారు. అలానే అల్లు అర్జున్‌కి సంబంధించిన పలు సినిమా స్టిల్స్ కూడా ఉంచారు. ఇకపోతే ప్రస్తుతం 'రాకా' చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ తన 23వ మూవీ చేయనున్నాడు. దీని ప్రీ ప్రొడక్షన్ వర్క్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్..

## ట్రైలర్ వచ్చేది ఆరోజే!



భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగష్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకానిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు ఈ ఫ్రాంచైజీ సిద్ధమైంది. ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4న కేవలం థియేటర్లలో మాత్రమే విడుదల కానుంది




# విజయ్ సేతుపతి 'స్లమ్ డాగ్' నుంచి అదిరిపోయే అప్డేట్.. ఇంటెన్స్ లుక్‌లో టబు !

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది

# 'చెన్నై లవ్ స్టోరీ' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. కిరణ్ అబ్బవరం మూవీ స్ట్రీమింగ్ ఎక్కడ అంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో మంచి స్పందన అందుకుంది. జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. 'బేబీ' సినిమాతో సక్సెస్ అందుకున్న సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు 21 నుంచి ఈ సినిమా ఓటీటీలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అధికారిక స్ట్రీమింగ్ తేదీపై మేకర్స్ లేదా ఓటీటీ సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ 'చెన్నై లవ్ స్టోరీ' స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, ఇప్పటికే చూసి మరోసారి సినిమా చూడాలనుకునేవారికి ఓటీటీ రిలీజ్ మంచి అవకాశంగా మారనుంది. 'చెన్నై లవ్ స్టోరీ' కథ విషయానికి వస్తే.. నివి అనే యువతి తన ప్రియుడు అజయ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. పెళ్లికి సిద్ధమవుతున్న సమయంలో అజయ్ తనకు మరో అమ్మాయి అంటే ఇష్టమని చెప్పి ఆమెతో విడిపోతాడు. ఊహించని బ్రేకప్‌తో నివి తీవ్రంగా కుంగిపోతుంది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె స్నేహితులు నివిని చెన్నైకి తీసుకెళ్తారు. కానీ అక్కడ కూడా ఆమె తన గతాన్ని మర్చిపోలేకపోతుంది. క్రమంగా మద్యానికి బానిసగా మారుతుంది. అదే సమయంలో అనుకోకుండా ఆమె జీవితంలోకి స్టీవెన్ శంకర్ అనే యువకుడు వస్తాడు. అనాథ అయిన స్టీవెన్‌కు డైరెక్టర్ కావాలన్నది కల. నివి స్నేహితుల గ్యాంగ్ అతడికి ఆశ్రయం కల్పిస్తుంది. మొదట్లో స్టీవెన్ చేసే పనులు, అతడి ప్రవర్తన నివికి చిరాకు తెప్పిస్తాయి. అయితే కాలక్రమంలో స్టీవెన్ మాటలు, అతడి ఆలోచనా విధానం నివిలో మార్పు తీసుకొస్తాయి. తన గత ప్రేమ వైఫల్యం నుంచి నెమ్మదిగా బయటపడిన నివి.. స్టీవెన్‌కు దగ్గరవుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలవుతుంది. అయితే అప్పుడే నివి గతం మరోసారి ఆమె ముందుకు వస్తుంది. అజయ్ మళ్లీ ఆమె జీవితంలోకి ఎందుకు వచ్చాడు? నివి, స్టీవెన్‌ల ప్రేమకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? చివరకు నివి ఎవరిని పెళ్లి చేసుకుంది? అనే అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించారు. త్రిగుణ్, దేవీ ప్రసాద్, సిరి హన్మంతు, పి. వాసు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో రవి నంబూరి దర్శకుడిగా పరిచయం అయ్యారు.